## 20న సమ్మెను విజయవంతం చేయాలి



జిల్లా పరిపాలన అధికారి సహిద్ అహ్మద్ మసూర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ, ఏఐకేఎస్, హమాలీ కార్మికులు

కామారెడ్డి, మే 3 : ఈ నెల 20వ తేదీ నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా పరిపాలన అధికారి సమిద్ అహ్మద్ మసూర్‌కు ఏఐటీయూసీ, ఏఐకేఎస్, సివిల్ సప్లయ్ హమాలీలు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. నకిలీ విత్తనాలు, మందులు అరికట్టాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు దశరథ్, సివిల్ సప్లై హమాలీ నాయకులు కృష్ణ, సాయిలు, దేవయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో 6వ తేదీన మెగా జాబ్ మేళా

ఎల్లారెడ్డి రూరల్, మే 3 : కామారెడ్డిలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు 6వ తేదీన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం, హెచ్‌సీఎల్ ప్రతినిధి రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ బీ ప్రోగ్రాం కోసం 2024, 2025 సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన వారు ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషనల్ కంప్యూటర్స్ చదివిన విద్యార్థులకు మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు 75 శాతం ఓవరాల్‌గాను, 60 శాతం గణితంలోను మార్కులు పొంది ఉండాలన్నారు. జాబ్‌మేళాకు వచ్చే వారు వెంట పదో తరగతి, ఇంటర్మీడియట్ పాస్ అయిన సర్టిఫికెట్స్, ఆధార్ జిరాక్స్‌లు, ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌ను తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 8074065803, 7981834205 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## వాలీబాల్స్ వితరణ



యువకులకు వాలీబాల్స్ అందజేసిన అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గైని రాజలింగం

లింగంపేట(తాడ్వాయి), మే 3 : తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వాలీబాల్స్ వితరణ చేశారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వేసవిలో శిక్షణ ఇవ్వడానికి ఐదు బాలీబాల్స్ వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ బాలాజీ, బూంపల్లి బాల్‌రాజ్‌తో పాటు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రహదారులపైనే ధాన్యం కుప్పలు

- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పర్మళ్ల గ్రామ శివారులో రహదారిపై ధాన్యం కుప్పలు

లింగంపేట, మే 3 : రైతులు పండించిన ధాన్యం రహదారులపై ఆరబెట్టడం ప్రమాదకరంగా మారింది. రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టడానికి సరైన సౌకర్యాలు లేని కారణంగా రైతులు తమ ధాన్యాన్ని రహదారులపై ఆరబెడుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టడానికి సరైన స్థలం లేని కారణంగా రైతులు బీటీ రోడ్లపై ఆరబెడుతున్నారు. వారం రోజుల క్రితం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం కొనసాగుతున్నప్పటికీ వాతావరణం అనుకూలించక పోవడంతో రైతులు ధాన్యం రహదారులపై ఆరబెడుతున్నారు. రెండు రోజుల క్రితం నల్లమడుగు గ్రామ రహదారిలో ధాన్యం ఆరబెట్టడంతో ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో గాంధారి మండలం సంగెం గ్రామానికి చెందిన యువకుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. రాత్రి పూట ధాన్యం రాసులపై నల్లటి టార్పాలిన్లు కప్పడంతో కుప్పలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రహదారిపై ధాన్యం ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## విద్యార్థులకు పాలిసెట్ బుక్స్ అందజేత




విద్యార్థులకు పాలిసెట్ కోచింగ్ బుక్స్ పంపిణీ చేస్తున్న టీజీవీపీ నాయకులు

కామారెడ్డి, మే 3 : జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలిసెట్ కోచింగ్ బుక్స్ శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీవీపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు సంజయ్, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, నియోజకవర్గ ఇన్‌చార్జి సమీర్, నాయకులు రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, మే 3 : కామారెడ్డి పట్టణానికి చెందిన బట్టు శ్రీనివాస్ ఇటీవల ఫోన్‌పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి శనివారం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

## లచ్చాపేటలో పశువైద్య శిబిరం



పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మాచారెడ్డి, మే 3 : మండలంలోని లచ్చాపేట గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కామారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వేసవి కాలంలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుపోషకులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, వైస్‌చైర్మన్ మినుకూరి బ్రహ్మానందరెడ్డి, మాచారెడ్డి సొసైటీ చైర్మన్ పూల్‌చంద్‌నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు మక్బూల్, నారాగౌడ్, రాజలింగం, సుదర్శన్‌రావు, జ్యోతిరెడ్డి, దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కొలతల ప్రకారం చేయాలి



అయ్యపల్లి తండాలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

లింగంపేట, మే 3 : ఉపాధి హామీ పథకంలో పనులు కొలతల ప్రకారం చేయాలని ఎంపీడీవో నరేశ్ కూలీలకు సూచించారు. లింగంపేట మండలం అయ్యపల్లి తండాలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ఉపాధి సిబ్బంది చూపిన విధంగా కొలతల ప్రకారం పనులు చేయడంతో కూలి డబ్బులు అధికంగా వస్తాయని తెలిపారు. నామ మాత్రంగా పనులు చేయడంతో కూలి డబ్బులు గిట్టుబాటు కావని సూచించారు. వ్యవసాయ బోరు బావుల వద్ద ఫాంపాండ్స్‌ను నిర్మించుకోవాలని సూచించారు. వీటి నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వర్షాలు కురిసే సమయంలో వరద వృథాగా పోకుండా భూమిలో ఇంకడానికి ఉపయోగపడుతాయని వెల్లడించారు. ఎంపీడీవో వెంట ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడితోపాటు కూలీలు ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు

మాచారెడ్డి, మే 3 : మండలంలోని గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ దవాఖాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు హంజీ నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో భూక్య భాస్కర్, రమేశ్‌గౌడ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బీబీపేట్(దోమకొండ), మే 3 : దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో ఉన్న హెల్త్ సెంటర్‌ను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్ సిబ్బంది ప్రజలకు అందుబాలులో ఉండాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట హెల్త్ సెంటర్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.

## ‘ఆయుష్మాన్ భారత్’ కార్డులను తీసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, మే 3 : లింగారెడ్డిపేట్ పల్లె దవాఖాన పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు ఆయుష్మాన్ భారత్ కార్డులను తీసుకోవాలని పల్లె దవాఖాన ఎంఎల్‌హెచ్‌పీ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగారెడ్డిపేట్, కళ్యాణి, దేవునిపల్లి, సఫ్దల్‌పూర్, దావల్ మల్కపల్లి, రేపల్లెవాడ గ్రామాల్లో ఇప్పటివరకు హెల్త్ కార్డులు తీసుకోకుండా ఉన్న వారు లింగారెడ్డిపేట్ పల్లెదవాఖానకు వచ్చి తీసుకోవాలన్నారు. పల్లె దవాఖానకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డులను తీసుకొని రావాలని ఆయన సూచించారు. సమయానికి ఊరిలో లేనివారు 970465022 నంబర్‌కు తమ ఆధార్‌కార్డులను పంపాలని పేర్కొన్నారు.

## వీసీబీని ప్రారంభించిన ఎస్ఈ



ముంబాజీపేటలో వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

లింగంపేట, మే 3 : మండలంలోని ముంబాజీపేట గ్రామంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో వీసీబీని జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కంచుమహల్ గ్రామానికి వ్యవసాయంతో పాటు గృహావసరాలకు 24 గంటలపాటు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. వీసీబీ బిగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈఈ విజయసారథి, ఏడీఈ మల్లేశం, ఇన్‌చార్జి ఏఈ అశోక్, లైన్‌మన్ పాండు, ఏఎల్‌ఎం ధర్మరాజు, సత్యనారాయణతోపాటు విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ పట్టివేత, కేసు నమోదు



మంజీరా నది నుంచి హైదరాబాద్ వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్

నిజాంసాగర్, మే 3 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ శనివారం పట్టుకున్నారు. మంజీరా నది నుంచి హైదరాబాద్ వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గేటు వద్ద పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# సర్వే పూర్తిచేసి వివరాలు సేకరించాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



కన్నాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట, మే 3 : భూ భారతి చట్టం ప్రకారం గ్రామాల్లో సర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లింగంపేట మండలంలోని పర్మళ్ల, కన్నాపూర్ గ్రామాల్లో శనివారం పర్యటించారు. కన్నాపూర్ గ్రామంలో భూ భారతి బృందం సభ్యులతో కలిసి క్షేత్ర పర్యటన చేశారు. సర్వే నంబర్ 240లో ఉన్న భూములు, పాసు పుస్తకాల కోసం వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ప్రకారం సాగు చేస్తున్న భూముల వివరాలు, ఎన్ని సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నారు, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు సేకరించాలని సూచించారు. అటవీ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. రైతులు సాగు చేసుకుంటున్న భూమి వివరాలను సంబంధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సర్వే నిర్వహించి ఎలాంటి సమస్యలు లేకుంటే పట్టాదారు పాసుపుస్తకాల జారీకి సిఫారసు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పర్మళ్ల గ్రామంలోని రైతు వేదికలో డెస్క్ వర్క్ చేస్తున్న అధికారులతో చర్చించారు. డెస్క్‌వర్క్ రికార్డులను పరిశీలించిన కలెక్టర్.. అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌తోపాటు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శక్కర్‌నగర్, మే 3 : బోధన్ పట్టణం రాకాసీపేట్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్టేషన్‌లో శనివారం వ్యక్తి మృతదేహన్ని గుర్తించిన రైల్వే స్టేషన్ మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సదరు మృత దేహన్ని రైల్వే పోలీసులు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ కుబేరుడు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



బిచ్కుందలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, మే 3 : బిచ్కుంద మండలంలో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన పుట్ట విఠల్ తమ్ముడు శివ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మండలంలోని మిషన్ కల్లాలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోదరుడు కుషాల్ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే షిండే పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, అవార్ శ్రీనివాస్, డాక్టర్ రాజు, బొమ్మల లక్ష్మణ్, సంతోష్ పటేల్, బస్వరాజ్, రమేశ్ పటేల్, శ్రీనివాస్, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత



చెక్కులను అందజేస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, మే 3 : బాన్సువాడ పట్టణంలోని పోచారం స్వగృహంలో శనివారం బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని 122 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

రామారెడ్డి(సదాశివనగర్), మే 3 : సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్డీవో సురేందర్ శనివారం పరిశీలించారు. వర్షపు నీటి సంరక్షణలో భాగంగా రాళ్ల కట్టడం పనులను పరిశీలించారు. అనంతరం కుప్రియాల్ గ్రామంలో హరితహారం నర్సరీని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్, ఐకేపీ ఏపీఎం రాజిరెడ్డి, ఏపీవో మధు, టెక్నికల్ అసిస్టెంట్ జగదీశ్ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీలో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్యుడు హరికిషన్

లింగంపేట, మే 3 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యుడు హరికిషన్ తెలిపారు. కంటి సంబంధిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీ టీచర్‌కు వివరించినట్లు ఆయన తెలిపారు. కంటి వైద్య శిబిరంలో ఆర్‌బీకేఎస్ వైద్యురాలు నిఖిత, అంగన్‌వాడీ టీచర్ సుచరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు

బాన్సువాడ, మే 3 : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రధాన రహదారిపై ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పాత బాన్సువాడకు చెందిన నక్క లచ్చవ్వ నస్రుల్లాబాద్‌కు మిరపకాయల తొడిమెలు తీసే పనికి వెళ్లి బాన్సువాడకు వచ్చింది. పాత బాన్సువాడకు వెళ్లేందుకు అంబేద్కర్ చౌరస్తా నుంచి రోడ్డుపై వెళ్తుండగా నిజామాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు బస్టాండ్ నుంచి నిజామాబాద్‌కు బయల్దేరింది. ప్రధాన రహదారి పైనుంచి వెళ్తున్న నక్క లచ్చవ్వను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లచ్చవ్వ ఎడమచేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. బస్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

## హత్య చేసిన నిందితుడికి రిమాండ్

బిచ్కుంద, మే 3 : తండ్రిని హత్య చేసిన తనయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామానికి చెందిన బిచ్కుంద రాజేందర్ మార్చి 18వ తేదీన రాత్రి తన తండ్రి భూమయ్యతో గొడవ పడ్డాడు.
భూమయ్య నిద్ర పోయిన తర్వాత తాడు తీసుకొని మెడకు బిగించి హత్య చేశాడు. మెడికల రిపోర్ట్ వచ్చిన తర్వాత రాజేందర్‌ను పట్టుకొని విచారించగా తన తండ్రి రోజూ గొడవ పడేవాడని, తనభార్యతో అసభ్యకరంగా ప్రవర్తించేవాడని, అందుకే తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకోగా రిమాండ్‌కు తరలించామని తెలిపారు. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్, పోలీస సిబ్బంది ఉన్నారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, మే 3 : మద్యానికి బానిసై యువకుడు ఆత్మ హత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మర్రి ప్రవీణ్(24) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి తండ్రిని మద్యం కోసం డబ్బులు అడిగాడు. తండ్రి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**రామారెడ్డిలో మరో యువకుడు..**

రామారెడ్డి, మే 3 : మండల కేంద్రంలోని చెరువులో దూకి యువకుడు మృతి చెందినట్లు రామారెడ్డి ఎస్సై రాజారాం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల బాలకృష్ణాగౌడ్(36) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శనివారం పటేల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లింగాల రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కూతురు ఉంది.

## పాడి రైతు మృతదేహం లభ్యం

నస్రుల్లాబాద్, మే 3 : బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన నీరడి సాయి బాబా(35) శుక్రవారం గ్రామ శివారులో గేదెలను మేపడానికి వెళ్లి నీటి కుంటలో పడి గల్లంతు కాగా శనివారం సాయిబాబా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



బిచ్కుందలోని ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బిచ్కుంద, మే 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత ఉర్దూమీడియం పాఠశాలలో నలుగురు విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో 600గాను 500పైన మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నలుగురు విద్యార్థినులను శనివారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ సాబెరా బేగం విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాజిద్ హుస్సేన్, లతీఫొద్దీన్, అహ్మద్, ఆలియా బేగం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.